స్కూళ్లకు రెండు రోజులు సెలవులు

- డిఇఒలు ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల తొలి విడత ఈ నెల 11న జరగనున్న నేపథ్యంలో పోలింగ్ జరిగే గ్రామాల్లోని స్కూళ్లకు రెండు రోజుల పాటు సెలవులు ఇస్తూ ఆయా జిల్లాల డిఇఒలు ఉత్తర్వులు జారీ చేశారు. పదిన పోలింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవడం, 11న పోలింగ్ ఉండడంతో సెలవులు ఇస్తున్నట్టు తెలిపారు. తొలి విడతలో 4,236 గ్రామాల్లో పోలింగ్ జరగనుండగా ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

ఫ్యూచర్ సిటీలో 'వంతారా'

- సిఎం సమక్షంలో ఎంఒయు
- ట్రంప్ మీడియా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు
- రూ.25 వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్ల ఏర్పాటు
- సింగపూర్ కంపెనీ ఎజిఐడిసి రూ.70వేల కోట్ల పెట్టుబడులు
- వివిధ సంస్థలతో సిఎం ప్రత్యేకంగా సమావేశం


సిఎం సమక్షంలో ఎంఒయు చేసుకుంటున్న వంతారా బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్శించడం, తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047 ఆవిష్కరణ, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా భారత్ ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. సమ్మిట్ మొదటి రోజు రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ కంపెనీలు ముందుకొచ్చాయి. కొరియా ప్రతినిధులతో సమావేశమై, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులపై చర్చించారు. ట్రంప్ మీడియా, అమెజాన్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. అమెజాన్ సంస్థ తెలంగాణలో లాజిస్టిక్స్, రిటైల్ రంగాల్లో విస్తరణపై ఆసక్తి చూపింది. ఐకియా సంస్థ ప్రతినిధులతో సమావేశమై, టెక్స్‌టైల్స్, ఫర్నీచర్ తయారీ రంగాల్లో ఎంఎస్ఎంఈ భాగస్వామ్యంపై చర్చించారు. వియత్నాంకు చెందిన ప్రముఖ సంస్థ విన్ గ్రూప్ ప్రతినిధులతో సమావేశమై, ఎలక్ట్రిక్ వాహనాలు, హెల్త్‌కేర్ రంగాల్లో పెట్టుబడులపై చర్చించారు. ఎలక్ట్రానిక్స్ రంగ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో ఫ్యూచర్ సిటీలో మాన్యుఫాక్చరింగ్ హబ్ స్థాపనపై చర్చించారు. ఎస్ఐడిబిఐ వరల్డ్ బ్యాంక్, వెస్ట్రన్ యూనియన్ ప్రతినిధులతో సమావేశమై, స్టార్టప్ ఫండింగ్, యూనివర్సిటీ ఆఫ్ లండన్‌తో ఉన్నత విద్యా భాగస్వామ్య ఎంఒయు కుదిరింది. సింగపూర్‌కు చెందిన ఎజిఐడిసి కంపెనీ రూ.70వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ సంస్థ ఎఐ ఆధారిత డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. వియత్నాంకు చెందిన విన్ గ్రూప్‌తో రూ.27వేలకోట్ల ఒప్పందం జరిగిందన్నారు. ఈ సంస్థ రాష్ట్రంలో సోలార్‌ప్లాంట్లు, ఇవి, ఎనర్జీ స్టోరేజీ ఏర్పాటు చేయనుంది.

సిఎం సమక్షంలో రిలయన్స్ బృందం ఎంఒయు

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో రిలయన్స్ సంస్థతో కీలక ఒప్పందం కుదిరింది. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముఖేష్ అంబాని కుమారుడు అనంత్‌అంబాని నిర్వహిస్తున్న వంతారా వన్యప్రాణుల సంస్థ ఫ్యూచర్ సిటీలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో వంతారా బృందం ఎంఒయు కుదుర్చుకుంది. వంతారా యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా సిఎం వారికి హామీ ఇచ్చారు.

పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం : ఎరిక్

రానున్న పదేండ్ల కాలంలో తెలంగాణలో రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు పెడతామని ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ డైరెక్టర్ ఎరిక్ ప్రకటించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనా పెట్టుబడులు పెట్టేందుకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. నీరు, భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ఇక్కడి ప్రభుత్వం పరిశ్రమలకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుండటంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని అభిప్రాయపడ్డారు.

రూ.25వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్: కరణ్ అదాని

దేశంలోనే అతి పెద్ద కార్పొరేట్ సంస్థ అయిన అదాని గ్రూప్ తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. రూ.25వేల కోట్లతో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని అదాని పోర్ట్స్ అండ్ సెజ్ ఎండి కరణ్ అదాని గ్లోబల్ సమ్మిట్ మొదటి రోజు ప్రకటించారు. తెలంగాణ విజన్‌ను ఈ సమ్మిట్ ప్రతిబింబిస్తోందని అన్నారు. "రాష్ట్రంలో గ్రీన్ డేటా సెంటర్లు, రెన్యువబుల్ ఎనర్జీ, సిమెంట్, డిఫెన్స్, ఏరోస్పేస్, యూఏవీ టెక్నాలజీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నాం. హైదరాబాద్‌లో తయారయ్యే యూవీలను సైన్యానికి అందిస్తాం. రాష్ట్రాన్ని అగ్ర పథాన నిలిపేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నిస్తోంది" అని కరణ్ అదాని తెలిపారు.

రూ.1700 కోట్లతో అపోలో విస్తరణ: శోభన కామినేని

తెలంగాణలో రాబోయే మూడేండ్లలో రూ.1,700 కోట్లతో అపోలో గ్రూప్ వైద్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించిందని సంస్థ వైస్ చైర్మన్ శోభనా కామినేని ప్రకటించారు. తెలంగాణలో ఫార్మా ఉత్పత్తి, అమ్మకాల్లో తమ సంస్థ 30 శాతం వాటా కలిగి ఉందని చెప్పారు.

తెలంగాణ విజన్ స్ఫూర్తిదాయకం సిఐఐ మాజీ చైర్మన్ దినేశ్

తెలంగాణ విజన్ స్ఫూర్తిదాయకంగా ఉందనీ, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని సిఐఐ మాజీ చైర్మన్ దినేశ్ అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతోందని గుర్తు చేశారు. దాన్ని మరింతంగా ముందుకు తీసుకు పోయేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం గొప్ప విషయమని కొనియాడారు.

మెడికల్ క్యాంపస్‌లో విద్యార్థుల మెరుపు ధర్నా

- కనీస వసతులు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహేశ్వరం మెడికల్ కళాశాలలో కనీస వసతుల కల్పనపై మెడికోలు మెరుపు ధర్నాకు దిగారు. విద్యార్థుల నినాదాలతో క్యాంపస్ దద్దరిల్లింది. పోలీసులు జోక్యం చేసుకున్నా విద్యార్థులు వెనక్కి తగ్గలేదు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని భీష్మించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో (అద్దె భవనం) కొనసాగుతున్న మహేశ్వరం మెడికల్ కళాశాలలో సోమవారం జరిగింది. మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇబ్రహీంపట్నంలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నెలకొల్పింది. అరకొర వసతుల మధ్యనే గత సంవత్సరం మెడికల్ కళాశాల ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులు దశలవారీగా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్య డైరెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దాంతో ఫలితం లేక సోమవారం విద్యార్థులు కళాశాల ఆవరణలోనే ఆందోళనకు దిగారు. సమస్యలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. దాంతో ఒక్కసారిగా పోలీసులు చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఎన్నికలు ప్రారంభమైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా పంచాయతీ ఎన్నికల్లో నిమగ్నమై ఉందని, ధర్నాను విరమించాలని సూచించారు. ఎన్నికలు ఈ నెలలోనే ప్రారంభమయ్యాయని, కానీ తాము గత సంవత్సర కాలంగా ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకుపోతూనే ఉన్నామని ఎందుకు పరిష్కరించలేదని విద్యార్థులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య విద్యాభ్యాసాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కళాశాల ఒక చోట ఉంటే.. ప్రాక్టికల్స్ మరోచోట చేయాల్సి వస్తోందని తెలిపారు. తాము నిత్యం 40 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీలో లైబ్రరీ, ప్రయోగశాలలు, ఇతర ముఖ్యమైన బోధనా సౌకర్యాలు లేవన్నారు. పీజీ కళాశాల, విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోవడంతో ప్రయివేటు హాస్టళ్లలో ఉంటున్నామని తెలిపారు. ఉదయం, సాయంత్రం కలిపి ఆరు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తున్నదని అన్నారు. విద్యార్థుల నుంచి నిధులు వసూలు చేస్తున్న అభివృద్ధి నిధులు ఎటు పోతున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వం తమ సమస్యలను పెడచెవిన పెడుతోందని ఆందోళన వెలిబుచ్చారు

కాంగ్రెస్ పాలనపై బిఆర్ఎస్ ఛార్జిషీట్

- ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై బిఆర్ఎస్ పార్టీ ఛార్జిషీట్‌ను సోమవారం విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని నిర్ణయించింది. కెసిఆర్ పాలనలో అన్ని రంగాల్లో చేసిన అభివృద్ధి గురించి చెప్తూనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకానిఅంశాలను ప్రజల్లోకి వివరించనుంది. భూరిజిస్ట్రేషన్లలో బిఆర్ఎస్ హయాంలో 15 శాతం నమోదు చేస్తే కాంగ్రెస్ హయాంలో 22 శాతం పతనమైందని విమర్శించింది. నిర్మాణ రంగంలో బిఆర్ఎస్ పాలనలో ప్రగతిపథంలో ముందుకెళ్తే కాంగ్రెస్ పాలనలో సంక్షోభం నెలకొందని తెలిపింది. రిజిస్ట్రేషన్ల ఆదాయం బిఆర్ఎస్ హయాంలో లక్ష్యానికి మించి వసూలైతే కాంగ్రెస్ హయాంలో లక్ష్యం కంటే రూ.403 కోట్లు తక్కువ ఉందని విమర్శించింది. అప్పుల సేకరణ బిఆర్ఎస్ తొమ్మిదేళ్లలో రూ.2.80 లక్షల కోట్లు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేసిందని తెలిపింది. అభివృద్ధి ఖర్చులో బిఆర్ఎస్ పాలనలో 16 శాతం ఉంటే కాంగ్రెస్ పాలనలో అది సగానికి ఎనిమిది శాతానికి పడిపోయిందని పేర్కొంది. ప్రభుత్వఆస్పత్రుల్లో కాన్పులు బిఆర్ఎస్ పాలనలో 70 శాతం ఉంటే ఇప్పుడు అది 55 శాతానికి తగ్గిందని తెలిపింది. బిఆర్ఎస్ ప్రభుత్వ ఉద్యోగాలు 1.63 లక్షలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఐదు వేలకు మించలేదని పేర్కొంది.

పద్య నాటక రచనలో ప్రవీణులు బలిజేపల్లి లక్ష్మీకాంతం

సిపిఎం నాయకుడు నంద్యాల నరసింహారెడ్డి



ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు ప్రజలకు ఒక నాడు పద్య పౌరాణిక నాటకాలే వినోద విజ్ఞాన నీతి బోధక మాధ్యమాలు అని ప్రముఖ సిపిఎం నాయకుడు నంద్యాల నరసింహా రెడ్డి అన్నారు. ఆ కాలంలో బలిజేపల్లి లక్ష్మీ కాంత కవి పద్య నాటక రచనలో ప్రవీణులుగా ప్రసిద్ధి పొందారని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభలోని సంగీత నాట్య వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీ కాంతం యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నంద్యాల నరసింహా రెడ్డి మాట్లాడుతూ బలిజేపల్లి లక్ష్మీ కాంతం రచించిన సత్య హరిచంద్రీయం నాటకం గ్రామ గ్రామనా వందల ప్రదర్శనలు నోచుకుందని చెప్పారు. ఆ నాటకంలో జాషువా పద్యాలు చేర్చి ఆధునిక కాలంలో ప్రదర్శించడంతో ఇప్పటికీ జనాదరణ పొందుతోందని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కేతరాజు పూర్ణిమ పాలక వర్గ సభ్యులు గీతాదేవి బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకాంక్షలు నెరవేర్చేనా?

- ఒయులో రేపు సిఎం పర్యటన
- శరవేగంగా ఏర్పాట్లు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో సిఎం రేవంత్‌రెడ్డి రెండోసారి పర్యటించనున్నారు. ఈ నెల 10న ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఏర్పాటు చేస్తున్న సభా వేదిక నుంచి సిఎం ప్రసంగించనున్నారు. ఎలాంటి పోలీసు ఆంక్షలు లేకుండానే ఓయూకు వస్తానని గతంలో చెప్పిన సిఎం ఆ దిశగానే ఏర్పాట్లు సాగుతున్నాయి. సిఎం కార్యక్రమానికి సుమారు 5 వేల మందికి ప్రవేశం ఉన్నట్టు ఒయు వర్గాల సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతున్నా ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు సైతం సిఎం సభను విజయవంతం చేసేందుకు ఐదు కమిటీలు ఏర్పాటు చేసి దీనిలో భాగస్వామ్యం అయ్యారు.

ఆశలు నెరవేనా?

సిఎం ఒయు సభలో ఏం ప్రస్తావిస్తారు.. ఏ అంశంపై మాట్లాడతారు.. ఏం హామీలు ఇస్తారు ? ఏ హామీలు నెరవేర్చుతారు? అన్న దానిపై విద్యార్థులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. రెగ్యులర్ ప్రొఫెసర్స్, రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు అధ్యాపకులు, టైమ్ స్కేల్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, పార్ట్ టైమ్ అధ్యాపకులతోపాటు ఒయులో పిహెచ్‌డి విద్యార్థులు తమకు రాష్ట్ర ప్రభుత్వం పెలోషిఫ్స్ ఇస్తుందని ఆశిస్తున్నారు. ఖాళీలతో వెక్కిరిస్తున్న ప్రొఫెసర్స్ నియామకాలు వర్సిటీ అభివృద్ధికి అడ్డంకిగా మారాయి. దాంతో గత్యంతరం లేక ఉన్న పలువురు ప్రొఫెసర్లు 2 నుంచి 4 పోస్టుల్లో పనిచేస్తున్నారు. వాటి భర్తీపై సిఎం నుంచి ఎలాంటి ప్రకటన రానుంది అన్న దానిపై నిరుద్యోగులు ఆశపడుతున్నారు.

రూ.1000 కోట్లు వస్తాయా?

సిఎం రేవంత్ రెడ్డి గతంలో ఒయులో చెప్పినట్టు రూ.వెయ్యి కోట్లు నిధులు ముందే ఇచ్చి వస్తారా? లేదా ఒయుకు వచ్చాక అధికారికంగా తెలియజేస్తారా? అన్న అంశాలపై లోతుగా చర్చ జరుగుతోంది. ఒయు వేదికపై నుంచే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. రైజింగ్ 2047 సదస్సు అయిపోయిన తర్వాత ఉద్యోగ ప్రకటనలు వస్తాయని ఇటీవల సిఎం పలు సభల్లో చెప్పిన విషయం తెలిసిందే. గతంలో ప్రజాప్రతినిధులు ఒయుకు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ నేడు సిఎం ఓయూకు వస్తుంటే యూనివర్సిటీలో 90 శాతం మంది హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నారు.

ఒయు ఎంప్లాయీస్ జెఎసి డిమాండ్లు

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దు, సిఎఎస్- కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు, కాంట్రాక్ట్ అండ్ పార్ట్ టైమ్ అధ్యాపకులు, కాంట్రాక్ట్/టైమ్ స్కేల్ నాన్ టీచింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కాంట్రాక్ట్ / పార్ట్ టైమ్ టీచర్లకు యూజీసీ పే స్కేల్, పార్ట్ టైమ్ టీచర్లను అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్‌కు అప్‌గ్రేడ్, టైమ్ స్కేల్ అండ్ కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఉద్యోగులకు 60 శాతం ఈపీఎఫ్, అన్ని విశ్వవిద్యాలయ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, జీఓ 21ను సవరించి పార్ట్ టైమ్ అధ్యాపకులకు సర్వీస్ వెయిటేజి ఇవ్వడం.

వేట కత్తులతో పొడిచి.. తుపాకీతో కాల్చి

జవహర్‌నగర్‌లో నడిరోడ్డుపై రియల్టర్ దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


నడిరోడ్డుపై ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు వేట కత్తులతో అతి కిరాతకంగా పొడిచి, తుపాకీతో కాల్చి హత్య చేశారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంట వెంకటరత్నం (54) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కాప్రా సాకేత్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం తన కుమార్తెను కాలనీలోని పూస్టర్ బిల్లా బాంగ్ స్కూల్‌లో వదిలాడు. తిరిగి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని వెంబడించి వేట కత్తులతో పొడిచి, తుపాకీతో కాల్చారు. అనంతరం బండరాయితో మోదారు. దాంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. వేట కత్తులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. వ్యక్తిగత, ఆర్థిక వ్యవహారాలే హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సిసి టివి ఫుటేజీల ఆధారంగా.. : మల్కాజిగిరి డిసిపి శ్రీధర్

ఘటనా స్థలాన్ని జవహర్‌నగర్ సిఐ సైదయ్యతో కలిసి మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హత్య జరిగిన సమాచారం రాగానే పోలీసులు అప్రమత్తమయ్యారని తెలిపారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ టీంలతో కలిసి విచారణ చేస్తున్నామన్నారు. మృతుడి తలలో బుల్లెట్ ఉన్నదని, కత్తులతో తల, మెడ, కడుపు, వీపుపై నరికి, బండరాయితో మోది చంపారని తెలిపారు. ఆటోలో నలుగురు, యాక్టివాపై ఇద్దరు దుండగులు వచ్చి దాడి చేసి చంపారన్నారు. మృతుడిపై ధూల్‌పేట్‌లో మర్డర్ కేసు, రౌడీషీట్ ఉన్నట్టు మీడియాలో కథనాలు వస్తున్నాయని, అతనిపై జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో అయితే ఎలాంటి కేసులూ లేవని అన్నారు. ధూల్‌పేటలో కేసులు ఉన్నాయా లేదా? పూర్తిస్థాయి విచారణ జరిపిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. సిసిటివి ఫుటేజీల ఆధారంగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్‌తో హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు

- క్రెడాయ్ వెల్లడి



హైదరాబాద్ : రెండు రోజుల జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌తో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించనుందని భారత రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (క్రెడాయ్) ప్రతినిధులు పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇది తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగ భవిష్యత్‌పై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ తదుపరి వృద్ధికి దశకు బలమైన పునాది వేయనుందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్. జయదీప్ రెడ్డి పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కేవలం ఒక సమావేశం కాదు. ఇది ప్రభుత్వ దృఢ సంకల్పానికి స్పష్టమైన ప్రకటన. రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ రియల్ ఎస్టేట్ రంగానికి దీర్ఘకాలిక ప్రణాళికలకు అవసరమైన స్థిరత్వాన్ని, విశ్వాసాన్ని అందిస్తుంది." అని జయదీప్ రెడ్డి తెలిపారు. "ఈ సమ్మిట్ విజయం బ్రాండ్ హైదరాబాద్‌పై గట్టి విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రపంచ వ్యాపార దిగ్గజాలను ఆకర్షించేందుకు చేసిన ప్రయత్నాలు నగర వృద్ధికి దోహదం చేస్తాయి." అని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ బి జగన్నాథ్ రావు పేర్కొన్నారు. ప్రకటించిన పెట్టుబడుల పరిమాణం ఐటి, తయారీ, వినోదం, లాజిస్టిక్స్ వంటి అనేక రంగాల్లో భారీగా ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ రెడ్డి తెలిపారు.

అతిరథ్ హోల్డింగ్స్‌రూ. 4 వేల కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వంతో అతిరథ్ హోల్డింగ్స్ ఇండియా లిమిటెడ్ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో గ్లోబల్ తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2025లో ఆ కంపెనీ చైర్మన్ లెఫ్టినెంట్ ఆర్ బాలకృష్ణన్, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంతకాలు చేశారు. రాష్ట్ర పునరుత్పాదక శక్తి లక్ష్యాల్లో ఇది ఒక పెద్ద మైలురాయిగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ బాలకృష్ణన్ మాట్లాడుతూ తెలంగాణలో స్థిరమైన ఇంధన భవిష్యత్తు వైపు ఒక ముందడుగుగా అభివర్ణించారు. ఈ రూ.4,000 కోట్లతో రాష్ట్రంలో 25 కంప్రెస్డ్ బయో-గ్యాస్ (సిబిసి) ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రతి ప్లాంట్ రోజుకు 20 టన్నుల (టిపిడి) సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 9,000 పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు రానున్నాయన్నారు. యువతతో పాటు రైతులకు పెద్దఎత్తున లాభం చేకూరనుందని చెప్పారు. తెలంగాణలో మొదటి సిబిజి ప్లాంట్‌కు భూమిపూజను జనవరిలో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగతా ప్లాంట్లు కూడా దశల వారీగా ప్రారంభమవుతాయన్నారు. ఈ ప్రాజెక్ట్ 15 నెలల్లో పూర్తిగా కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ కాదు... గోబెల్స్ సమ్మిట్

- ఇది ప్రజాపాలన కాదు... నయవంచన
- మాజీమంత్రి హరీశ్‌రావు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ పేరుతో నిర్వహిస్తున్నది గ్లోబల్ సమ్మిట్ కాదని, గోబెల్స్ సమ్మిట్ అని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఈ రెండేళ్లలో అన్ని వర్గాల ప్రజలకూ మొండిచేయి చూపించిందని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రెండేండ్లలో అంతా అయోమయం, గందరగోళం, ఆగమాగం అని అన్నారు. హామీలు అమలు చేయలేదని, అభివృద్ధి, సంక్షేమంలో అడుగు ముందుకు పడలేదని చెప్పారు. ఈ రెండేళ్లలో నిస్సారం, నిష్పలం, నిరర్థకమని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఒక్క రోజే ప్రజలను కలిశారని అన్నారు. ఆయనో బిల్డప్ బాబాయిలా మారాడని చెప్పారు. విందులు, వినోదాలు, జల్సాలకు ప్రజాభవన్ వేదికగా మారిందని చెప్పారు. సిఎల్‌పి సమావేశాలు జరుగుతున్నాయని వివరించారు. అభివృద్ధి ఏంలేదని, పారదర్శకత కాకుండా దోపిడీ చేస్తున్నారని, గ్యారంటీలు గారడీగా మారాయని అన్నారు. ఇది ప్రజా పాలన కాదని, నయవంచక పాలన అని విమర్శించారు. అంతా ఆత్మస్తుతి పరనింద అని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదు, విధానం లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గిందని చెప్పారు. ప్రభుత్వ ఆదాయం ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. వ్యవస్థీకృత అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. ఆర్ఆర్ పన్ను, భట్టి, పొంగులేటి, ఉత్తమ్ పేరుతో పన్నులను వసూలు చేస్తున్నారని అన్నారు. ఇందులో కాంగ్రెస్ అధిష్టానానికి కూడా భాగముందన్నారు. కాదేదీ కవితకు అనర్హం అన్నట్టు కాంగ్రెస్ పాలనలో కాదేదీ స్కాంకు అనర్హం అన్నట్టుగా మారిందని చెప్పారు. కాంగ్రెస్‌ది అభయహస్తం కాదని, భస్మాసుర హస్తమని విమర్శించారు. నెలకు రూ.2,500 ఇవ్వకుండా మహిళలను మోసం చేశారని అన్నారు. హత్యలు, లైంగిక దాడులు, ఆత్మహత్యల్లో తెలంగాణ రైజింగ్‌గా ఉందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకపోవడం వల్ల ఓ బిసి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ప్రభుత్వం విజయోత్సవాలు కాకుండా అపజయోత్సవాలను నిర్వహించాలని కోరారు. అందర్నీ మోసం చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ ఊరిలో అయినా పూర్తిగా రుణమాఫీ అయ్యిందా? అని ప్రశ్నించారు. మధిర, ఖమ్మం, కొడంగల్ నియోజకవర్గాల్లో ఏ గ్రామానికైనా వెళ్దామని సవాల్ విసిరారు. అందరికీ రుణమాఫీ అయ్యిందంటే రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. ఈ ప్రభుత్వం జాబ్‌లెస్ క్యాలెండర్‌ను ప్రకటించిందన్నారు. ఈ రెండేండ్లలో రూ.18 వేల కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చిందని అన్నారు. దీనిపై బహిరంగచర్చకు సిద్ధమని ప్రకటించారు. గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలతో విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారం అందించలేని ఈ సీఎం అట్టర్‌ఫ్లాప్ అయ్యారని అన్నారు. వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్ పెంపు ఏమైందని ప్రశ్నించారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.20 వేల కోట్లు దారిమళ్లాయని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టికి ఆ కుర్చీలో ఉండే అర్హత లేదన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేని దుస్థితిలో ఉందని చెప్పారు. ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీతో ఈనెల 13న సీఎం రేవంత్‌రెడ్డి ఆట వల్ల ప్రజలకు ఏమైనా ఒరుగుతుందా?అని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీలు, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రేవంత్‌రెడ్డిని ప్రజలే ఫుట్‌బాల్ ఆడతారని హెచ్చరించారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పనిచేసే నాయకులకు ఓటెయ్యండి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి.. పని చేసే నాయకులకు ఓటు వేయాలని, నిజమైన ప్రజాసేవకులను ఎన్నుకోవాలని, వామపక్ష ప్రజాతంత్ర లౌకికశక్తుల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో పది వార్డుల్లో సిపిఎం అభ్యర్థులు ఏకగ్రీవమైనట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూ పరిష్కారం కోసం కృషి చేస్తున్న నాయకులను ఎన్నికల్లో ఎన్నుకోవాలని కోరారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే ఆలోచన కేవలం వామపక్ష ప్రజాతంత్ర, లౌకికశక్తుల అభ్యర్థులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. అలాంటి వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటే సమస్యలు పరిష్కారం కావడంతో పాటు గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

గ్రామాల ప్రతిష్ట పెంచే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 16 గ్రామ పంచాయతీల్లో సర్పంచులకు, 150పైగా వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్నామని తెలిపారు. ఇందులో ఇప్పటికే పది వార్డుల్లో సిపిఎం బలపర్చిన అభ్యర్థులు ఏకగ్రీవమైనట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, వినోద్ నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు గోవింద్‌రెడ్డి, దయానంద్, సంపత్ ఉన్నారు.

గురుకుల ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయులపై మోపిన బోధనేతర పనుల అదనపు భారాన్ని తగ్గించాలనీ, ఉపాధ్యాయులను మనుషులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) డిమాండ్ చేసింది. సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో ప్రతిరోజూ ముగ్గురు ఉపాధ్యాయులు పాఠశాలలో రాత్రి బస చేయాలనీ, ఆదివారాలు, సెలవు రోజుల్లో నలుగురు ఉపాధ్యాయులు డ్యూటీ చేయాలని ఇచ్చిన ఆదేశాలు ఉపసంహరించాలని టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ డిమాండ్ చేశారు. ప్రతిరోజూ ముగ్గురు ఉపాధ్యాయులు రాత్రి బస చేయాలనీ, రాత్రి 11 గంటలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల కాపలా కోసం ఇద్దరు వాచ్‌మెన్లు ఉంటారు. ఒక ఉపాధ్యాయుడు కేర్ టేకర్‌గా ఉంటారు. ఇప్పుడు ముగ్గురు ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ వేయడం ద్వారా వారి స్థాయిని వాచ్‌మెన్ స్థాయికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవు రోజుల్లో పని చేసిన ఉపాధ్యాయులకు వీక్లీ ఆఫ్ ఇవ్వడం లేదనీ, పదిహేను రోజులపాటు వరుసగా డ్యూటీలో ఉంటారనీ, వారంలో కనీసం రెండు రోజులు రాత్రి కాపలా ఉండాల్సి వస్తుందనీ, వారు మరుసటి రోజు మధ్యాహ్నం వరకు విధుల్లో కొనసాగాల్సి ఉంటుందని తెలిపారు. గురుకుల ఉపాధ్యాయులు రోబోలు కాదని, వారికీ కుటుంబాలు ఉన్నాయనీ, మానవ హక్కులు కూడా ఉంటాయని సొసైటీ అధికారులు గుర్తించాలని వారు స్పష్టం చేశారు. సొసైటీ కార్యదర్శిని కలిసి సమస్యలను వివరించే ప్రయత్నం చేద్దామంటే అవకాశమే ఇవ్వడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులకు అదనపు విధుల కేటాయింపు ఆదేశాలను తక్షణమే ఉపసంహరించాలనీ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు

- కనీస వేతనాలు సవరించని రాష్ట్ర ప్రభుత్వం
- లేబర్ కోడ్లు రద్దయ్యే వరకు పోరాటం
- డిసెంబర్ 31 నుంచి సిఐటియు అఖిల భారత మహాసభ : పాలడుగు భాస్కర్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల సమస్యలపై అన్ని ట్రేడ్ యూనియన్‌లను కలుపుకొని ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మెదక్‌లో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర 5వ మహాసభల ప్రారంభ సభ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలుకొని నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైతం.. కార్మికుల కనీస వేతన జిఒను ఇప్పటివరకు సవరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు కోటీ 50 లక్షల మంది ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కోరలు లేని నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలులోకి తెచ్చిందన్నారు. శ్రమ శక్తి నీతి 2025 పేరుతో కొత్త లేబర్ పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం, విద్యుత్ సవరణ బిల్లు, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రైల్వే, రోడ్డు రవాణా తదితర రంగాల్లో కార్మిక వ్యతిరేక సంస్కరణలు తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షణ రంగ సంస్థలను ఏడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలతో ప్రభుత్వ రంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలను సవరించలేదని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టేందుకు ఈ మహాసభలో తగిన కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతామని తెలిపారు. యూనియన్లకు అతీతంగా గ్రామ స్థాయిలోని కార్మిక వర్గాన్ని భాగస్వాములను చేద్దామని, రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలను విస్తృతపరచాలని సిఐటియు 5వ మహాసభ తీర్మానం చేసిందని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో సిఐటియు లిఖత భారత మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, జిల్లా కార్యదర్శి ఎ మల్లేశం పాల్గొన్నారు.

గ్రామకంఠం భూములను ప్రయివేటీకరించొద్దు

- తక్షణమే లీజు ఒప్పందాన్ని రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 12వేల గ్రామ పంచాయితీలకు చెందిన గ్రామకంఠం భూములను 30 ఏండ్ల పాటు ఐఒఆర్ఎ ఎకోలాజికల్ సొల్యూషన్ ప్రయివేటు సంస్థకు అప్పజెప్పడాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పాలక మండళ్లు లేని సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం నిరభ్యంతర పత్రాలను తీసుకోవాలనడం అప్రజాస్వామికమని, వేలాది కోట్ల ఆస్తులను ప్రయివేటు సంస్థకు కట్టబెట్టడం వెనుక భారీ కుంభకోణం జరుగుతున్నదనే సందేహం వ్యక్తమవుతోందని పేర్కొంది. ఈ ఒప్పందం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగంలోని 73వ సవరణ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని ఎత్తిచూపింది. తక్షణమే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. 'పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు. హరిత సౌభాగ్యం ప్రాజెక్టు పేరుతో గ్రామ కంఠం భూములను ఢిల్లీకి చెందిన ఒక ప్రయివేటు కంపెనీకి కట్టబెడితే గ్రామపంచాయితీలు తమ హక్కులను, ఆదాయాలను కోల్పోతాయి. దీని వల్ల భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు, పేదల పునరావాసం, తదితర ప్రజా అవసరాలకు భూములు లేకుండా పోతాయి' అని ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. భూముల విలువ ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామకంఠాలపై పూర్తి హక్కులు పంచాయతీలకే ఉండేలా చూడాలని కోరారు.

మియాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

- సుమారు రూ.600 కోట్లు విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిలో ఎన్నో ఏళ్లుగా షెడ్లు ఏర్పాటుచేసుకుని కబ్జాకు యత్నం
- స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన హైడ్రా అధికారులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూముల రక్షణకు ఏర్పడ్డ హైడ్రా.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని విలువైన భూమిని కాపాడింది. శేరిలింగంపల్లి మండలం మక్త మహబూబ్‌పేట గ్రామ పరిధిలోని 44/5 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యక్తులు కొన్నేండ్లుగా షెడ్లను ఏర్పాటు చేసుకుని వాటిని కిరాయికి ఇచ్చారు. ప్రభుత్వ భూమిని తమ సొంత భూమిగా అనుభవిస్తున్నారని కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు సోమవారం కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. కూల్చివేతల అనంతరం కంచెను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ.. మక్త మహ బూబ్ పేట చెరువు కట్టకు అనుకుని ఉన్న 44/5 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు కొన్నేండ్లుగా దర్జాగా ఆక్రమించుకొని అక్రమంగా కట్టడాలు చేపట్టినట్టు తమకొచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ విభాగాలతో పూర్తిగా సమాచారం తీసుకున్న అనంతరం ఇక్కడ కూల్చివేతలు చేపట్టినట్టు తెలిపారు. ఈ స్థలంలో పెద్ద ఎత్తున కంటైనర్లు, ప్రయివేటు ట్రావెల్ బస్సులు ఇతర వాహనాలను పార్కింగ్ చేసి ఈ స్థలం ఎవరికి కనపడకుండా ప్రయివేట్ వ్యక్తులకు సంబంధించిన భూమి లాగా నమ్మించేందుకు ప్రయత్నం చేశారని అన్నారు. 30 మంది సిబ్బంది కూల్చివేత కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ కంచెను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ భూములు ఎవరు ఆక్రమించుకున్న కఠిన చర్యలు ఉంటాయని హైడ్రా అధికారులు తెలిపారు.

మార్పునకు తెలంగాణ నాయకత్వం

- మహిళా ఆధారిత అభివృద్ధికి గ్లోబల్, రోల్ మోడల్‌గా తెలంగాణ
- 2047 నాటికి మహిళా శ్రామిక భాగస్వామ్యం 90 శాతమే లక్ష్యం : మంత్రి సీతక్క



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు స్వయం సమృద్ధితో ఎదిగితేనే ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదుగుతుందనీ, ఆ మార్పునకు తెలంగాణ నాయకత్వం వహిస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) నొక్కి చెప్పారు. మహిళా ఆధారిత అభివృద్ధికి గ్లోబల్, రోల్ మోడల్‌గా తెలంగాణ నిలుస్తోందన్నారు. సోమవారం ఫ్యూచర్‌సిటీలో ప్రారంభమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో మంత్రి సీతక్క ప్రసంగించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటైన మహిళా శక్తి క్యాంటీన్లు స్థిర ఆదాయ వనరులుగా మారాయన్నారు. స్కూల్ యూనిఫాం తయారీ, పాఠశాలల అభివృద్ధి పనులు, అద్దె బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల ఏర్పాటు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మహిళలకు ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నాయని వివరించారు. 32 జిల్లాల్లో మహిళల చేత ఏర్పాటు కాబోతున్న 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు దేశంలోనే తొలి ఉదాహరణగా నిలిచాయని వెల్లడించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.7,600 కోట్లను ఆదా చేసుకున్నారని తెలిపారు. మెప్మా, సెర్ప్‌లను ఏకీకృతం చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జీడీపీలో మహిళల వాటా 40 శాతముంటే మన దేశంలో అది 20 శాతానికి కూడా చేరలేదని వాపోయారు. మహిళా శ్రామిక భాగస్వామ్యాన్ని 2047 నాటికి 90 శాతానికి పెంచడమే లక్ష్యంగా తమ ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. పెట్టుబడిదారులు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు తెలంగాణలో అవకాశాలు అన్వేషించాలనీ, పెట్టుబడులు పెట్టాలని కోరారు.

సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్య కిరణ్ తెలిపిన వివరాలు ప్రకారం.. పిప్పడ్‌పల్లి గ్రామానికి చెందిన చాల్కి రాజు (35) కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కాగా, రెండు, మూడు రోజుల నుంచి ఎలక్షన్లకు డబ్బులు లేవని, ఈ రాజకీయాల్లో తాను తట్టుకోలేనని మనస్తాపం చెందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి భక్తులతో శంశోదిన్ పూర్ గ్రామ శివారులోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో నిద్రించారు. సోమవారం తెల్లవారుజామున ఆయన కాలకృత్యాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో సన్నిధానంలో ఉన్న యాత్రికులకు అనుమానం వచ్చి పొలంలోకి వెళ్లి చూడగా ఓ చెట్టుకు ఉరేసుకొని కనిపించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చైతన్య కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనంతరం మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుండెపోటుతో మహిళా వార్డు అభ్యర్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండెపోటుతో మహిళా వార్డు అభ్యర్థి మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన మంచర్లగూడ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచర్లగూడ గ్రామానికి చెందిన పల్లె లత (45).. ఎనిమిదో వార్డు నుంచి వార్డు సభ్యురాలిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 14న ఎన్నికలు జరగనున్నాయి. కాగా ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను శంకర్‌పల్లిలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. ఈ విషయంపై ఎంపిడిఒను వివరణ కోరగా.. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే, వార్డులో ఎన్నిక విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులకు తెలపనున్నట్టు చెప్పారు. వారి సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. మిగతా ఎన్నికలు సజావుగా జరుగుతాయని తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దుడ్డు బియ్యాన్ని ఏం చేద్దాం!

- పౌరసరఫరాల శాఖ అధికారుల్లో తర్జనభర్జన
- సన్న బియ్యం సరఫరాతో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ
- పెరిగిపోతున్న నిల్వలు... ముక్కిపోతున్న వైనం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేదకుటుంబానికి సన్నబియ్యం సరఫరా చేస్తోంది. ఏడు నెలల నుంచి (ఉగాది పండుగ) దీన్ని అమల్లోకి తెచ్చింది. ఈ క్రమంలో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు నిలిచిపోయాయి. వాటిని ఏం చేయాలో తెలియక పౌరసరఫరాల శాఖ తర్జనభర్జన పడుతోంది. గోదాముల్లో బియ్యం నిల్వలు పెరిగిపోయి చాలా వరకు ముక్కిపోతున్నాయి. పురుగులు పట్టి పనికి రాకుండా పోతున్నాయి. ఎక్కువ రోజులు ఇదే విధంగా నిల్వలు ఉంచడం ద్వారా పౌరసరఫరాల శాఖకు సుమారు రూ.450 కోట్ల నష్టం జరిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల గోదాముల్లో 90 వేల మెట్రిక్ టన్నులు, రేషన్ దుకాణాల్లో 25 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మరికొంత కాలం వీటిపై దృష్టి పెట్టకపోతే బియ్యం ముక్కిపోయి సముద్రంలో పారబోసే పరిస్థితి వస్తుంది. పాత నిల్వలతో సన్న బియ్యాన్ని ఎక్కడా నిల్వ చేయాలో అధికారులకు సవాల్ మారింది. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే దొడ్డు బియ్యం మొత్తం పాడైపోయే అవకాశం ఉంది. బియ్యానికి పురుగులు పట్టి పిండిగా మారుతున్నాయి. గోదాముల్లో దొడ్డు బియ్యం నిల్వలు ఉండడంతో సన్న బియ్యాన్ని నిల్వ చేసేందుకు చోటు లేకుండాపోతోంది. డీలర్లు కూడా దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయని, వాపసు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరుతున్నారు. కొన్ని నెలలుగా దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ షాపుల్లో, గోదాముల్లో ముక్కిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉగాది పండుగకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన సర్కారు... అదే సమయంలో దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. అందుకు కొన్ని నిబంధనలు అడ్డొస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

దొడ్డు బియ్యం అమ్మకానికి ఉన్న అవకాశాలివే.

దొడ్డు బియ్యం అమ్మకానికి ఎన్నో అవకాశాలున్నాయి. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని బెవరేజెస్ కంపెనీలకు సరఫరా చేయవచ్చు. మద్యం తయారీలో వీటిని విరివిగా ఉపయోగిస్తారు. దొడ్డు బియ్యాన్ని కూడా పౌల్ట్రీ పరిశ్రమకు సరసమైన ధరలకు అమ్మవచ్చు. ప్రస్తుతం అక్కడ మొక్కజొన్నలను ఉపయోగిస్తున్నారు. మొక్కజొన్నలు తక్కువ ధరకు దొరుకుతున్నాయన్న కారణం చూపి ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మక్కలను దిగుమతి చేసుకుంటున్నాయి. దాన్నే దాణాకు ఉపయోగిస్తున్నారు. బిఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం మక్కలను కొని, వాటిని పౌల్ట్రీ పరిశ్రమకు సబ్సిడీ పేరుతో సరఫరా చేసేది. కానీ అందులో కమీషన్ల పేరుతో వేల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు రావడంతో అప్పటి ప్రభుత్వం మక్కలను కొనడం ఆపేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి కొనడం ప్రారంభించింది. మొక్కజొన్నలతోపాటు దొడ్డు బియ్యం కూడా పౌల్ట్రీ పరిశ్రమకు సరఫరా చేయాలని అధికారులు కోరుతున్నారు. మరోవైపు కర్ణాటక రాష్ట్రం పేదలకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తోంది. ఆ ప్రభుత్వంతో మాట్లాడి దొడ్డు బియ్యంపై తగిన ఒప్పందం చేసుకోవడం ద్వారా రాష్ట్రంలో నిల్వలు తగ్గిపోతాయని చెబుతున్నారు. టెండర్లలో ఎవరు ఎక్కువ ధరను కోడ్ చేస్తే వారికే దొడ్డు బియ్యం సరఫరా చేయాలని సర్కారు భావిస్తోంది. వీటిని కిలో రూ. 35 నుంచి రూ.40ల చొప్పున టెండర్ల ద్వారా విక్రయిస్తే సర్కారుకు భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీటిపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని అధికారులు, డీలర్లు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- డ్రైవర్, మహిళ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిప్పర్ ఢీకొట్టడంతో ర్యాపిడో బైక్ డ్రైవర్‌తోపాటు ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సిఐ సుధీర్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన కావరెడ్డి శ్రీకాంత్, జ్యోతి (32) దంపతులు. సూరారం వెంకటరమ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరు సూరారం జ్యోతి మిల్క్ కంపెనీ ఎదురుగా కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం శ్రీకాంత్ కూరగాయలు తేవడానికి షాపూర్‌నగర్ మార్కెట్‌కు వెళ్లారు. జ్యోతి దుకాణం తెరిచేందుకు ర్యాపిడో బైక్ బుక్ చేసుకొని ఇంటి నుంచి బయలుదేరారు. బైక్ మిల్క్ కంపెనీ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ అదుపుతప్పి బలంగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో ఆమెతోపాటు రాపిడో డ్రైవర్ సాయిబాబా నగర్ పాండు బస్తీకి చెందిన కె సురేందర్ రెడ్డి (45) అక్కడికక్కడే మృతి చెందారు. సూరారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం దృశ్యాలు పక్కనే ఉన్న సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి.

భైంసాలో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మహిళ దారుణ హత్యకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం కుంసర గ్రామానికి చెందిన వివాహిత అశ్విని (30) భర్తతో విడాకులు తీసుకున్నారు. కొంత కాలంగా పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఇప్పరే నగేష్‌తో సహజీవనం చేస్తున్నారు. ఐదు నెలల కిందట అశ్వినికి భైంసాలోని సంతోషిమాత ఆలయం సమీపంలో జీవనోపాధి కోసం నగేష్ టీస్టాల్ పెట్టించారు. ఈ క్రమంలో ఇటీవల అశ్విని వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటూ చాట్ చేస్తోందని నగేష్ అనుమానం పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమెను కత్తితో పొడిచి, రాడ్‌తో కొట్టి హత్య చేశారు. నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.